
సాక్షి
ఒడిశా
మంగళవారం। 10। జనవరి। 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,82,445లు, బంగారం 3.35 గ్రాములు, వెండి 100 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



భిన్న సంస్కృతుల ప్రతీక.. చౌయితి

- 8లో



జీవనశైలిగా మిషన్‌శక్తి

- సీఎం నవీన్ పట్నాయక్

- 8లో

న్యూస్‌రీల్

అధికారి ఇంట్లో రూ.11 లక్షలు స్వాధీనం

- భూసార పరీక్షా కేంద్రం అధికారి ఇంట్లో విజిలెన్స్ దాడులు



నాయక్ ఇంట్లో లభ్యమైన నగదు

రాయగడ: భూసార పరీక్షా కేంద్రం(సోయల్ కంజర్వేషన్) అదనపు అధికారి కిశోర్‌చంద్ర నాయక్ ఇంట్లో విజిలెన్స్ అధికారులు ఆదివారం రాత్రి ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి రూ.11,34,560ల నగదును స్వాధీనం చేసుకొని, అనంతరం అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కొలనార సమితిలో భూసరంక్షణ పరీక్షా కేంద్రంలో అదనపు అధికారిగా విధులు నిర్వహిస్తున్న నాయక్ గత కొన్నాళ్లగా సంబంధిత లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు కొలనార నుంచి బైక్‌పై రాయగడలోని తన ఇంటికి వెళ్తున్న నాయక్‌ను మార్గం మధ్యలో అడ్డుకున్న విజిలెన్స్ అధికారులు బ్యాగును తనిఖీ చేశారు. ఇందులో 5,04,560ల నగదు పట్టుబడింది. అనంతరం రాయగడ మంగళా మందిరం సమీపంలోని అతని నివాసంలో దాడి చేయగా, మరో రూ.6,30,000ల నగదు లభ్యమైంది. దీంతో అధికారి అదుపులోకి తీసుకోవడంతో పాటు భువనేశ్వర్, నవరంగపూర్ లోని ఇళ్లలో కూడా దాడులు కొనసాగిస్తున్నారు. రాయగడ విజిలెన్స్ డీఎస్పీ సురేంద్రనాథ్ రాయ్ గురు నేతృత్వంలో ఈ దాడులు జరిగాయి.

పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండా



వేదికపై బైజయంత్ పండా, గౌతమ్ శాంత్ర తదితరులు

కొరాపుట్: భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లే భాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండా సూచించారు. కొరాపుట్ సమితి కొలాబ్ సమీపంలోని మహదేవ్‌పుట్‌లో సోమవారం జరిగిన కార్యకర్తల శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. పార్టీ సిద్ధాంతాలపై ప్రజలకు ఉన్న నమ్మకం కారణంగానే అత్యధిక రాష్ట్రాల్లో గెలుపు సాధ్యమవుతుందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తే ఒడిశాలో కూడా విజయం సాధ్యమవుతుందని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు దిశగా ఇప్పటి నుంచే కార్యచరణ సిద్ధం చేయాలని కోరారు. అంతకుముందు భారతమాత చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సుమంత్ ప్రధాన్, గౌతమ్ శాంత్ర, పుర్ణిమా నాయక్, బైద్యనాథ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

42 ఎకరాల్లో గంజాయి పంటకు నిప్పు



గంజాయి పంటకు నిప్పంటిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసు స్టేషన్ పరిధి నక్కమామ్ముడి పంచాయతీ పరజగూడ గ్రామంలో బలిమెల ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులు చేపట్టారు. 42 ఎకరాల్లో గంజాయి పంటను గుర్తించి, ధ్వంసం చేయడతో పాటు నిప్పంటించారు. 2 రోజుల క్రితం గంజాయి సాగుపై దాడులు చేసేందుకు వచ్చిన పోలీసులను గ్రామస్తులు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులు పాల్గొని, మొక్కలను ధ్వంసం చేశారు.



బోండా ఘాటీపై కోయ నృత్యాలతో అధికారులకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

- మల్కన్‌గిరి మాల్యవంత్ ఉత్సవాలకు శ్రీకారం
- బోండాఘాటీ అమ్మాకుండ్ నుంచి పవిత్ర జలాల సేకరణ
- మల్కన్‌గిరి భైవర మందిరానికి తరలింపు
- యాత్రలో కళాకారులను ఉత్సాహ పరిచిన కలెక్టర్ విశాల్‌సింగ్



పవిత్ర జల కలశాన్ని మహిళకు అందిస్తున్న కలెక్టర్ విశాల్‌సింగ్

కనుల పండువగా కలశోత్సవం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న మాల్యవంత్ మహోత్సవాలకు సోమవారం అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా ఖొయిర్‌పుట్ సమితి బోండాఘాటీపై ఉన్న అమ్మా కుండ్ నది నుంచి పవిత్ర జలాన్ని సేకరించి, మల్కన్‌గిరి భైరవ మందిరానికి తరలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విశాల్‌సింగ్, ఇతర అధికారులు కాలి నడకన అమ్మాకుండ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి, జలాన్ని కలశంలో భద్రపరిచి, మహిళలకు అందజేశారు. అనంతరం భారీ ఊరేగింపు మధ్య ప్రత్యేక వాహనాల్లో కలశాలను జిల్లా కేంద్రానికి చేర్చారు. మార్గం మధ్యలో బోండా, కోయ తెగల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఉత్సాహ పరుస్తూ కలెక్టర్ ముందుకు కదలడంతో యాత్ర సందడిగా సాగింది. కలశాలను మల్కన్‌గిరి భైరవ మందిరానికి తరలించగా, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.



జెండా ఊపి, రథాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

వీటిని ఈనెల 15న మాల్యవంత్ ఉత్సవాలు జరిగే మండపానికి తరలిస్తారు. అప్పటి వరకు స్థానిక జగన్నాథ మందిరం వద్ద భద్ర పరుస్తారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు అడ్మా రావ్వ, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, జిల్లా ఎస్పీ నితీష్ వాధ్వనీ, జిల్లా అటవీశాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి, ఖొయిర్‌పూట్ సమితి అభివృద్ధి అధికారి హృదానాంద సాహు, సమితి అధ్యక్షుడు విష్ణు కిరసాని, ఇతర అధికారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీతమ్మను పూజిస్తూ..

చరిత్ర ప్రకారం త్రేతాయుగంలో శ్రీరాముడు వనవాసం సమయంలో బోండాఘాటీపై విశ్రాంతి తీసుకున్నారు. సమీపంలోని ఓ జలధార వద్ద సీతమ్మ వారు స్నానం చేయడాన్ని చూసిన ఈ ప్రాంత బోండా జాతి గిరిజనులు నవ్వడంతో ఆమె ఆగ్రహానికి గురయ్యారు. మీరు కూడా దుస్తులు లేకుండా జీవించండి అంటూ శాపం విధించిండంతో వారంతా ఆమెనే శరణు కోరారు. దీంతో శాంతించిన సీతమ్మ ఒంటిపై ఆకులు చుట్టకొని, పూసలను ధరించమని సూచించింది. అప్పటి నుంచి ఆమెనే పూజిస్తూ అమ్మాకుండ్‌ను పవిత్ర స్థలంగా భావిస్తుంటారు. ప్రస్తుత కాలంలో కూడా జిల్లాలో ఎటువంటి ఉత్సవాలు జరిగినా ఇక్కడి నుంచే పవిత్ర జలాలను తీసుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఇటీవల అయోధ్య రామమందిరం ప్రతిష్ట నిమిత్తం రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషలాల్ స్వయంగా అమ్మాకుండ్ సందర్శించి, పవిత్ర జలాన్ని సేకరించారు.



కలశయాత్రలో పాల్గొనేందుకు వచ్చేసిన మహిళలు, భక్తులు

రాష్ట్రంలో కొత్త పోలీస్ స్టేషన్లు

- ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త పోలీసు స్టేషన్లను ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన 30 పోలీస్ స్టేషన్లను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారం ప్రజలకు అంకితమిచ్చారు. భువనేశ్వర్ మైత్రి విహార్‌లో నిర్మించిన పోలీస్ ఠాణాకు ప్రత్యక్షంగా హాజరైన ఆయన.. అక్కడి నుంచి ఇతర ప్రాంతాల్లోని స్టేషన్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. 23 జిల్లాల్లో కొత్త పోలీస్ స్టేషన్లు నిర్మించారు. కార్యక్రమానికి మంత్రులు అశోక్‌చంద్ర పండా, తుషార్ కాంతి బెహరా, భువనేశ్వర్ ఎమ్మెల్యే అనంతనారాయణ జెనా, జట్నీ ఎమ్మెల్యే సురేష్‌కుమార్ రౌత్రాయ్, నగర మేయర్ సులోచన దాస్, డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్, కటక్-భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్రకుమార్ ప్రియదర్శి తదితర ప్రముఖులు హాజరయ్యారు.

రామనగుడలో..

రాయగడ: జిల్లాలోని రామనగుడలో కొత్తగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని సీఎం నవీన్ వర్చువల్ మాధ్యమంలో ప్రారంభించగా, రాష్ట ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు, బిజు స్వాస్థ్య సమితి సలహాదారుడు సుధీర్‌దాస్, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్‌పర్సన్ అనసూయ మాఝి, జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి ప్రత్యక్షంగా హాజరయ్యారు. గత ఏడాది ఆగస్టులో రామనగుడలో నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించేందుకు హామీ ఇచ్చానని, ఇది నెరవేరిందని ఈ సందర్భంగా సీఎం నవీన్ ప్రకటించారు.



కొరాపుట్: మైదల్‌పూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్పీ ఎస్.సుశ్రీ, ఎమ్మెల్యేలు

అవుట్ పోస్టుల విస్తరణ

కొరాపుట్: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి సుంకిలో నూతన పోలీస్ స్టేషన్‌ను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. దక్షిణాంచల్ డీఐజీ రాజేష్ పండిట్, కొరాపుట్ ఎస్పీ అభినవ్ శంకర్, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్, మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల పంగి పాల్గొన్నారు. అలాగే నవరంగ్‌పూర్ జిల్లా సరిహద్దు మైదల్‌పూర్ పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎస్పీ ఎస్.సుశ్రీ, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారీ, మాజీ ఎమ్మెల్యే భుజబల్ మాఝి, జెడ్పీ సభ్యురాలు లిపికా మాఝూ, పపడాహండి సమితి వైస్ చైర్మన్ టట్టు బెహరా పాల్గొన్నారు. గతంలో పోలీస్ అవుట్ పోస్టులుగా ఉన్న ఈ ప్రాంతాలను సరిహద్దు సమస్యలు నెలకొన్న నేపథ్యంలో పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్లుగా విస్తరించారు.



కొరాపుట్: సుంకి స్టేషన్ ప్రారంభంలో డీఐజీ రాజేష్ పండిట్, ఎస్పీ అభినవ్, ఎమ్మెల్యేలు



రాయగడ: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సరక, మాజీ ఎంపీ నెక్కంటి

న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యం

- కలెక్టర్ కార్యాలయం ముందు వృద్ధ దంపతుల ఆవేదన

రాయగడ: మాకు న్యాయం చేయండి.. లేదంటే ఆత్మహత్యకు అనుమతివ్వాలని కోరుతూ కాసీపూర్ సమితికి చెందిన వృద్ధ దంపతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. టికిరి పంచాయతీ నువాపడ గ్రామానికి చెందిన ఫిలిప్స్ బెహరా, అతని భార్య బాసంతి తురుక్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాసీపూర్‌లోని ఉత్కళ అల్యూమిన కర్మాగారం ఏర్పాటు సమయంలో తహసీల్ పరిధిలోని ద్విముండి మౌజాలో సుమారు 26 సెంట్ల స్థలాన్ని కర్మాగారం ఆక్రమించుకుందని తెలిపారు. అప్పట్లో నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పిన కర్మాగార యాజమాన్యం ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు పరిహారం ఇవ్వక పోవడంతో పాటు తమ భూమిని సైతం అప్పగించ లేదన్నారు. గత పదిహేనేళ్లుగా సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయిందని వాపోయారు. ప్రస్తుతం తమకు పూట గడవడమే కష్టతరంగా ఉందని, తమ భూమి ఉంటే కనీసం కూరగాయలైనా పండించుకొని బతికే వాళ్లమని కన్నీరు మున్నీరయ్యారు. ఇదే విషయమై ఈనెల 4న కలెక్టర్ కార్యాలయం ఎదుట తాము నిరసన తెలియజేస్తే పోలీసులు దౌర్జన్య పూరితంగా తమను ఎత్తుకు వెళ్లి, హాస్పిటల్‌లో చేర్పించారని వివరించారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లామని, ఇప్పటికైనా తమకు న్యాయం జరగకపోతే ఇద్దరం ఆత్మహత్య చేసుకుంటామంటూ విలపించారు. అయితే దంపతులు మీడియాతో మాట్లాడటాన్ని గమనించిన పోలీసులు.. తిరిగి వారి స్వగ్రామానికి పంపించారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించిన వృద్ధ దంపతులు

దండకారణ్య కశ్మీరం..



జయపురం: మున్సిపాలిటీ పరిధి డొంగాగుడలో చలి కాగుతున్న ప్రజలు

- కశ్మీర్‌ను తలపిస్తున్న కొరాపుట్ జిల్లాలు
- గణనీయంగా దిగజారిన ఉష్ణోగ్రతలు



దమంజోడి నాల్కో వద్ద నమెదైన 0.96 డిగ్రీల ఉష్ణోగ్రత



కొరాపుట్ జిల్లా పుక్కాలి వద్ద కారుపై కురిసిన మంచు

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలు కశ్మీర్‌ను తలపిస్తున్నాయి. గత 3 రోజులుగా గతంలో ఎన్నడూ లేని విధంగా చలిపులి విజృంభిస్తోంది. రాత్రి సమయాల్లో కశ్మీర్‌ను తలపిస్తూ మంచు వర్షంలా కురుస్తోంది. దమంజోడి హిల్ టాప్ ఏరియా భారత అల్యూమినియం కేంద్రం(నాల్కో) వద్ద గత రెండు రోజుల్లో 0.96 డిగ్రీల ఉష్ణోగ్రత నమెదైంది. సిమిలిగుడ, పొట్టంగి సమితులు, మాచ్‌ఖండ్, ఒనక ఢిల్లీ, దేవమాలి తదితర ప్రాంతాల్లో సాయంత్రం 3 నుంచే చలిగాలులు ప్రారంభం కాగా.. ఉదయం 10 గంటల వరకు ప్రభావం తగ్గడం లేదు. దీంతో ప్రజలు భయటకు రావడానికి భయపడుతున్నారు. సినిమా థియేటర్లలో రాత్రి రెండో ఆట(సెకెండ్ షో) చూసే వారే కరువయ్యారు. మంచు పర్యాటకులకు ఆనందాన్ని కలిగిస్తున్నా.. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోలేదని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు చలిగాలులతో వృద్ధులు, చిన్నారులు అనారోగ్యానికి కారణమవుతున్నాయి. రోగులలో అత్యధికులు దగ్గు, జ్వరం, గొంతునొప్పితో బాధపడుతూ వైద్యుల వద్ద క్యూ కడుతున్నారు.

జయపురంలో తగ్గిపోతున్న ఉష్ణోగ్రత

జయపురం: పట్టణంలో గత కొద్ది రోజులుగా రాత్రి పూట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. శనివారం కనిష్ఠ ఉష్ణోగ్రత 14 డిగ్రీలు ఉండగా ఆదివారానికి 10 డిగ్రీలకు పడిపోయింది. జయపురంలో ఉదయం 9 గంటల వరకు పట్టణంలో పొగమంచు కురుస్తుండటంతో తెల్లవారి వాకింగ్‌కు సైతం వెళ్లలేక పోతున్నామని వాకర్స్ చెబుతున్నారు. మరోవైపు రోడ్డు సరిగా కనిపించక పోవడంతో రాకపోకలపై ప్రభావం చూపుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నవీన్ నివాస్ ముట్టడి విఫలయత్నం

- రైతు సమస్యలపై నవనిర్మాణ రైతు సంఘటన్ ఆందోళన



ఆందోళనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

భువనేశ్వర్: రాష్ట్రంలో రైతుల ఆందోళన ఉధృతమవుతోంది. నవనిర్మాణ రైతు సంఘటన్ ఆధ్వర్యంలో రైతులు ముఖ్యమంత్రి నవీన్ నివాస్ ముట్టడికి సోమవారం విఫలయత్నం చేశారు. అనంతరం విమానాశ్రయ పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. ధాన్యానికి సబ్సిడీ ధర రైతులకు అందడం లేదని, పంట దళారులు పాలవ్వడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పురుషుల హాకీ ప్రపంచకప్ పోటీల నిర్వహణ పట్ల కనబరుస్తున్న శ్రద్ధ.. రైతాంగం బాగోగుల పట్ల ప్రభుత్వం కనబరచడం లేదని విమర్శించారు. ప్రభుత్వ తీరు మారకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 145 అసెంబ్లీ స్థానాల్లో నవనిర్మాణ రైతు సంఘటన్ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలో రైతాంగం జైలుకు వెళ్లేందుకు సైతం వెనుకంజ వేయబోదని స్పష్టంచేశారు. రైతుల ఉద్యమంతో నగరంలో ఉద్రిక్తత నెలకొంది. రోడ్డుపై వరిసాగు చేసి నిరసన తెలిపగా, ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పెద్ద సంఖ్యలో రైతులు రెండు ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలు, ప్లకార్డులతో నవీన్ నివాస్ ముట్టడించేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డుకున్న పోలీసులు.. దారి మళ్లించారు. నవ నిర్మాణ రైతు సంఘం కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సంతాపం తెలిపిన గ్రామీణ పూజారులు



జయపురం కోట వద్ద కుంధ్రా సమితి పూజారులు

జయపురం: రాజమాత మహారాణి రమా కుమారి దేవి మృతికి సంతాపం తెలిపేందుకు కుంధ్రా సమితిలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఆలయాలు, మందిరాల పూజారులు, సిశాలు, దిసారీలు సోమవారం జయపురం రాజుల కోటకు చేరుకున్నారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చి, రాజమాత మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. రాకుమారుడు విశ్వేశ్వర చంద్రచూడ్ దేవ్‌ను కలిసి, విచారం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు.

జయంతిగిరి విద్యార్థిని ప్రతిభ



సౌమ్యశ్రీకి ప్రశంసాపత్రం అందిస్తున్న నిర్వహకులు

జయపురం: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి విజ్ఞాన క్విజ్ పోటీల్లో జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి లోని జయంతగిరి ఒడిశా ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరిచింది. సౌమ్యశ్రీ సామంతరాయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి, ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని 30 జిల్లాల నుంచి విద్యార్థులు హాజరైన ఈ పోటీల్లో సౌమ్యశ్రీ బహుమతి సాధించడంపై పాఠశాల ప్రిన్సిపాల్ రోహిత్‌కుమార్ సెఠి, ఉపాధ్యాయురాలు మిలిక హల్దార్, సిబ్బంది అభినందించారు.

క్లుప్తంగా

శ్రీశైల మల్లన్నకు తలపాగా

- నేత పనికి శ్రీకారం



పెనుబాకలో తలపాగా కోసం నేతపని చేపట్టిన చేనేత కార్మికులు

రాజాం సిటీ: రాజాం మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన చేనేత కార్మికులు శ్రీశైల మల్లన్న తలపాగా తయారీకి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని పెద్దవీధిలో సోమవారం నేత పనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వడ్డి పుష్పావతి మాట్లాడుతూ ఏటా శివరాత్రి నాటికి శ్రీశైల మల్లికార్జున స్వామికి తలపాగా సమర్పించడం కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోందన్నారు. దీని తయారీకి సుమారు రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనికి చేనేత కార్మికులంతా సహకరిస్తున్నారని తెలిపారు.

సర్వమంగళాదేవికి రాజన్న పూజలు



రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర దంపతులు

పార్వతీపురం: పార్వతీపురం పట్టణంలోని శ్రీవిద్యా సర్వమంగళాదేవి పీఠంలో అమ్మవారిని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర దంపతులు సోమవారం దర్శించుకున్నారు. రావిచెట్టు వద్ద కొలువై ఉన్న సర్వమంగళాదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శివకామేశ్వరీ కల్యాణ మండపంలో నాడీ జ్యోతిష్య బ్రహ్మశ్రీ మురపాక కాళీ స్వామి, కె.రామ్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన చండీహోమంలో పాల్గొన్నారు.

కెమిస్ట్, ప్రొడక్షన్ కోర్సుకు శిక్షణ

విజయనగరం రూరల్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని అర్హులైన అభ్యర్థులకు రీడాక్స్ లేబొరేటరీ సహకారంతో స్కిల్ కాలేజీలో శిక్షణ అందిస్తామని ఏపీఎస్ఎస్ డీసీ జిల్లా అధికారి నీలం గోవిందరావు సోమవారం తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 18–24ఏళ్ల లోపు అభ్యర్థులకు వీటిఅగ్రహారం సమీపంలోని టీటీడీసీలో 4 నెలల పాటు శిక్షణ అందిస్తామని, అనంతరం ఫార్మా కంపెనీలో ఉపాధి కల్పిస్తామని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 18న ఉదయం 9 గంటలకు టీటీడీసీ మహిళా ప్రాంగణంలో బయోడేటా, ఆధార్ కార్డ్, విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు సెల్: 85558 32416, 94929278 44 నంబర్లను సంప్రదించాలన్నారు.

పట్టభద్రుల ఓటర్ల జాబితా విడుదల

పార్వతీపురం: పట్టభద్రుల ఓటర్ల జాబితాను కలెక్టర్ నిషాంత్‌కుమార్ తన కార్యాలయంలో సోమవారం విడుదలచేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ షెడ్యూల్ ప్రకారం పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు ఓటర్లు నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేశామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 18,327 మంది ఓటర్లుగా నమోదు కాగా, వారిలో 12,380 మంది పురుషులు, 5,945 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్స్ ఓటర్లు ఉన్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.హేమలత, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి ఆర్. ఉమామహేశ్వరరావు, ఇ–సెక్షన్ సూపరింటెండెంట్ డి.రవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు జె.భాస్కరరావు, ఎ.పేర్రాజు, జి.వెంకటనాయుడు, డి.రవి, బి. మహేశ్వరరావు, వి.చంటి, పి.శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి మంగళవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి బి.శాంతకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీన బొబ్బిలి డివిజన్‌కు సంబంధించి గ్రోత్ సెంటర్‌లో ఉన్న ఆర్‌డీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు, 12న చీపురపల్లి డివిజన్ పరిధిలో ఉన్న అభ్యర్థులకు చీపురపల్లిలో ఉన్న సీడీపీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు, విజయనగరం డివిజన్ పరిధిలో ఉన్న వారికి ఆర్డీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జనసేనతో కలిసి పోటీచేస్తాం

గజపతినగరం రూరల్: వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో జనసేనతో కలిసి పోటీచేస్తామని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. మరుపల్లి గ్రామంలోని బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనతో కలిసి పోటీచేసే అంశంపై కేంద్ర నాయకులతో మాట్లాడటం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని, కళాశాల డైరెక్టర్ శేఖర్ పాల్గొన్నారు.

అలరించిన పురిలయ నృత్యాలు

- జయపురంలో సందడిగా పుషిపుణి పర్వ్ ఉత్సవాలు

జయపురం: స్థానిక పట్టణంలో జిల్లా కళాకారుల బృందం నిర్వహిస్తున్న పుషిపుణి పర్వ్ మహోత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. మూడో రోజు వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి పర్వ్ వేదికపై నిర్వహించిన పురిలియ ఛౌ నృత్యాలు, కొరాపుట్ ఆదివాసీ డ్యాన్స్‌లతో ఒడిశా కళా సంస్కృతిని చాటి చెప్పాయి. స్వీప్ మేక్ కళా సంస్థ ప్రదర్శించిన పురిలియ చౌ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. జిల్లా ఆదివాసీ కళాకారుల డ్యాన్స్‌లు ఆదివాసీ కళా సంస్కృతికి అద్దం పట్టాయి. పుషిపుణి ఉత్సవంలో 12 ఆదివాసీ గ్రూపులు పాల్గొన్నాయి. ఎముకలు కొరికే చలిలో వందలాది మంది ప్రేక్షకులు కార్యక్రమాలను ఆసాంతం తిలకించి, ఆనందం వ్యక్తం చేశారు. గుణుపూర్ కళాకారుల సవర నృత్యం, జయపురం మీరా డ్యాన్స్ గ్రూప్, అలఫా గ్రూప్ వివిధ నృత్యరీతులను ప్రదర్శించారు. జయపురం పుషిపుణి భేట్‌ఘాట్ పర్వ్ కమిటీ అధ్యక్షుడు ధీరేన్ మోహన పట్నాయక్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో హిమాంశు మహాపాత్రొ,రబినాయక్, కార్తీక రౌత్, శంభర ప్రహరాజ్, గోపాల సామంతరాయ్, మనోజ్ పాత్రొ, గుప్త పాత్రొ, గుప్తా పాణిగ్రహి, మహ్మద్ షరీఫ్, ఉమాకాంత మహరాణా, లింగరాజ్ నిశంఖో, రామనాథ్ త్రిపాఠి, రస్మిరంజన్ సాగర్ తదితరులు పర్యవేక్షించారు.



ప్రేక్షకులను అలరించిన ఆదివాసీ నృత్యం



ఆదివాసీ సంప్రదాయ కృత్యంలో ఓ సన్నివేశం



చౌ నృత్యంలో సింహం డ్యాన్స్

భిన్న సంస్కృతుల ప్రతీక.. చౌయితి



ప్రసంగిస్తున్న మంత్రి జగన్నాథ సరక, వేదికపై కలెక్టర్ సింగ్, సుధీర్ దాస్

- రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక
- రెండో రోజుకు చౌయితి ఉత్సవాలు
- బ్యాట్మింటన్, స్లో సైకిలింగ్ పోటీలు ప్రారంభం

రాయగడ: చౌయితి ఉత్సవాలు భిన్న సంస్కృతులకు ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అభిప్రాయం వ్యక్తంచేశారు. చౌయితి క్రీడోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బ్యాట్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 21వరకు రాయగడ గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండేళ్ల విరామం అనంతరం జరుగుతున్న ఉత్సవాలు విజయవంతమయ్యే విధంగా అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే సమితి స్థాయిలో ఉత్సవాల నిర్వహణ పూర్తయ్యిందని, ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు, కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ తరహా కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం నిర్వహిస్తోందని వివరించారు.

జిల్లాలో మూడు ఇండోర్ స్టేడియంలు..

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లాలోని బిసంకటక్, గుడారి, గుణుపూర్ ప్రాంతాల్లో అధునాతన సౌకర్యాలతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని బిజు స్వాస్థ్య కల్యాణ సమితి సలహాదారుడు సుధీర్ దాస్ తెలిపారు. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. చౌయితి ఉత్సవాలు మన భాషా, సంస్కృతికి నిదర్శనన్నారు. వాటిని పరిరక్షించేందుకు అంతా ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, క్రీడాశాఖ అధికారి షేక్ ఆలీనూర్ తదితరులు ప్రసంగించారు. క్రీడోత్సవాల్లో భాగంగా ఇండోర్ స్టేడియంలో జరిగిన బ్యాట్మింటన్ పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. మంత్రి జగన్నాథ సరక, కలెక్టర్ సింగ్, ఎస్పీ శర్మ కాసేపు బ్యాట్మింటన్ ఆడి, క్రీడాకారులను ఉత్సాహ పరిచారు.

విద్యార్థినులకు స్లో సైకిలింగ్..

రాయగడ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో చౌయితి క్రీడా విభాగం బాలికల మధ్య స్లో సైకిలింగ్ పోటీలు నిర్వహించారు. రాయగడ మున్సిపల్ చైర్మన్ శుభ్రా పండా ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఇందులో వివిధ పాఠశాలలకు చెందిన 71మంది బాలికలు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 18 నుంచి జరగనున్న ఉత్సవాల ముగింపు రోజు బహుమతులు అందించనున్నారు.



బ్యాట్మింటన్ ఆడుతున్న మంత్రి సరక, కలెక్టర్



స్లో సైకిలింగ్ పోటీలో పాల్గొన్న బాలికలు

జొరిగాంలో ప్రసంగిస్తున్న ఈశ్వర్ పాణిగ్రాహి, ఎంపీ రమేష్, ప్రదీప్, ప్రకాష్



గెలుపు బాధ్యత కార్యకర్తలదే

- బీజేడీ నవరంగ్‌పూర్ జిల్లా పరిశీలకుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి

కొరాపుట్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటూ బీజేడీకి వేయడంతో పాటు అభ్యర్థుల గెలుపు బాధ్యత కార్యకర్తలే వహించాలని కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు, నవరంగ్‌పూర్ జిల్లా పార్టీ పరిశీలకుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి అన్నారు. నవరంగ్‌పూర్ జిల్లా జొరిగాం విధానసభ స్థాయిలో బీజేడీ పార్టీ 25వ వ్యవస్థాపక ఉత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనతాదళ్ హయాం నుంచి జొరిగాం తమ కంచుకోట అని గుర్తుచేశారు. ఇక్కడ నుంచే దివంగత జాదవ మాఝి బీజూ పట్నాయక్ కేబినెట్‌లో మంత్రిగా పని చేశారన్నారు. అనంతరం అతని కుమారులు రమేష్ మాఝి ఓటమి ఎరుగని నేతగా కొనసాగుతూ ప్రస్తుత నవరంగ్‌పూర్ ఎంపీగా ఉన్నారన్నారు. మరో కుమారుడు ప్రకాష్‌చంద్ర మాఝి జొరిగాం ఎమ్మెల్యే గెలుపొందడం ప్రజల అభిమానానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సలహాదారుడు ప్రదీప్ తండ్రి భగవాన్ మాఝిని అప్పట్లో బీజూ పట్నాయక్ రాజ్యసభకి నామినేట్ చేశారని ప్రస్తావించారు. బీజేడీ పట్ల జొరిగాం ప్రజలు చూపించిన ఆదరణ తీర్చుకోలేదని తెలిపారు. అనంతరం ఎంపీ రమేష్ మాఝి, ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మాఝి, ఎమ్మెల్యే ప్రకాష్‌చంద్ర, జెడ్పీ అధ్యక్షుడు మోతీరాం నాయక్ ప్రసంగించారు.

సిమిలిగుడలో..

కొరాపుట్ జిల్లా పొట్టంగి నియోజకవర్గ స్థాయి సభ సిమిలిగుడలో జరిగింది. పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాడి మాట్లాడుతూ పేద ప్రజల కష్టాలు తీరుస్తున్న బీజేడీని 2024లో కూడా గెలిపించాలని కోరారు. సభలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ, మాజీ ఎంపీ జిన్ను హికాక, మాజీ ఎమ్మెల్యేలు కైలాష్ కులసిక, ప్రపుల్ల పంగి, జెడ్పీ అధ్యక్షురాలు సస్మితా మెలకా, సునాబెడా మున్సిపల్ చైర్మన్ రాజేంద్రకుమార్ పాత్రొ తదితరులు పాల్గొన్నారు.



సిమిలిగుడ సభకు హాజరైన బీజేడీ కార్యకర్తలు

జీవనశైలిగా.. మిషన్‌శక్తి

- సీఎం నవీన్ పట్నాయక్ ముఖ్యమంత్రి
- మహిళా స్వయంశక్తి సంఘాలకు వడ్డీ రాయితీ విడుదల

భువనేశ్వర్: స్వయం సహాయక సంఘాలకు వడ్డీ రాయితీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారం ప్రారంభించారు. 2022–23 ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల వడ్డీ రాయితీ ప్రయోజనాలు సమగ్రంగా రూ.125 కోట్లు విడుదల చేశారు. ప్రభుత్వ ఆర్థిక సాయంతో సాధికారిత పుంజుకుంటున్న మహిళా స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలుగా(ఎస్ఎంఈ) ఎదుగుతున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రానున్న 5ఏళ్లలో మిషన్‌శక్తి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీ రాయితీ ప్రయోజనాల వ్యయ ప్రణాళిక రూ.1200 కోట్లుగా ప్రకటించారు. సాంకేతిక మాధ్యమాల్లో లబ్ధిదారుల పొదుపు ఖాతాలకు వడ్డీ రాయితీ మొత్తం బదిలీ అవుతుందని, మహిళల నేతృత్వంలోని మిషన్‌శక్తి, స్వయం సహాయక సంఘాల సంస్థలకు సంస్థాగత ఆర్థికసాయం మంజూరు చేస్తున్నామన్నారు. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ విధానం దోహదపడుతోందని పేర్కొన్నారు. గత 5 ఏళ్లలో సుమారు 4 లక్షల మహిళా స్వయంసహాయక సంఘాలకు రూ.17,000 కోట్ల రుణాలు మంజూరయ్యాయన్నారు. వడ్డీ రాయితీ ప్రయోజనం మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందని, రానున్న 5 ఏళ్లలో రూ.50 వేల కోట్ల నిధుల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

సున్నా వడ్డీ రుణ పరిమితి పెంపు..

మహిళల్లో వ్యాపార సంస్థల నిర్వహణ ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని సీఎం నవీన్ తెలిపారు. మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్–2022 పురస్కరించుకుని జిల్లాస్థాయి సమాఖ్యలకు రూ.కోటి చొప్పున, మండల స్థాయి సమాఖ్యలకు రూ.50 లక్షలు రివాల్వింగ్ ఫండ్‌గా ప్రకటించారు. గ్రామ పంచాయతీ స్థాయి సమాఖ్యలకు మార్కెట్ కాంప్లెక్స్‌తో కూడిన కార్యాలయ భవనం, మైక్రో, మినీ పారిశ్రామిక పార్కులు ఏర్పాటుకు ఆర్థిక సహాయం మంజూరు చేస్తామన్నారు. మిషన్‌శక్తి గ్రూపులకు సాధికారత కల్పించేందుకు సున్నా వడ్డీ రుణ పరిమితిని ప్రభుత్వం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు విస్తరించిందని వివరించారు.

తొలి మహిళా మిషశక్తి భవనం..

జాజ్‌పూర్‌లో తొలి మహిళా మిషన్‌శక్తి భవనాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వర్చువల్‌గా ప్రారంభించారు. మిషన్‌శక్తి కమిషనర్, ప్రభుత్వ కార్యదర్శి సుజాత కార్తికేయన్, 5టీ శాఖ కార్యదర్శి వీకే పాండియన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 314 మండలాలు, 30 జిల్లాల నుంచి వర్చువల్‌గా అనుసంధానించిన వేలాది మంది స్వయం సహాయక బృందాల నాయకులతో 400 స్వయం సహాయక నాయకులను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు, ఈ సందర్భంగా మిషన్‌శక్తి నినాదం మాత్రమే కాదు జీవన శైలిగా మారిందన్నారు. రూ.కోటి వ్యయ ప్రణాళికతో ప్రతి జిల్లాలో జిల్లా మిషన్‌శక్తి భవనం నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించారు. విక్రయ కేంద్రాలు, కంప్యూటర్ శిక్షణా కేంద్రం, కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం, మల్టీపర్పస్ థియేటర్‌తో కూడిన అత్యాధునిక సౌకర్యాల సముదాయంగా మిషన్‌శక్తి భవన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి మహిళను పారిశ్రామికవేత్తగా చూడాలని ఉవ్విళూరుతున్నట్లు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఒడిశా పరివర్తనలో మహిళల పాత్ర గణనీయమని పేర్కొన్నారు.



మిశన్‌శక్తి సంఘాలకు వడ్డీ రాయితీ చెక్కును అందిస్తున్న సీఎం నవీన్



కార్యక్రమంలో పాల్గొన్న మహిళా స్వయం సహాయక బృందాల ప్రతినిధులు

ప్రభుత్వ భూమి కబ్జాపై ఆరా

- అక్రమ లే అవుట్లను సర్వేచేసిన రెవెన్యూ అధికారులు
- సాక్షి కథనంతో కదిలిన యంత్రాంగం
- సుమారు 86 సెంట్లు ప్రభుత్వ భూమి ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తింపు
- పూర్తిస్థాయిలో సర్వేచేసి త్వరలో వివరాలు వెల్లడిస్తామన్న తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్

వీరఘట్టం:

ప్రభుత్వ భూమిని కబ్జాచేసి, డి–పట్టా భూములను చౌకగా కొల్లగొట్టి ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్లు వేస్తుండడంపై 'వీరఘట్టంలో రియల్ దందా' అనే శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. వీరఘట్టం శివారు పాలకొండ రోడ్డులో చదును చేసిన పంట భూములను తహసీల్దార్ జల్లేపల్లి మాధవి సర్వే బృందంతో సోమవారం సర్వే చేయించారు. ఇక్కడ చదును చేసి వెంచర్లు వేసిన చోట ప్రభుత్వ పోరంబోకు సుమారు 86 సెంట్లు ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. సర్వే నంబర్ 162/2లో 14 సెంట్లు, 191/2లో 49 సెంట్లు, 214లో 2 సెంట్లు, 216/1లో 16 సెంట్లు, 217లో 5 సెంట్లు ఉన్నట్టు నిర్ధారించారు. ఇక్కడ చదును చేసిన భూమిని పూర్తి స్థాయిలో సర్వేచేసి ఇందులో జిరాయతీ భూమి, ప్రభుత్వ పోరంబోకు, డి–పట్టా భూమిని వేరు చేస్తామన్నారు. ఆ వివరాలను త్వరలో వెల్లడిస్తామని తహసీల్దార్ మాధవి 'సాక్షి'కి తెలిపారు.

ఇదీ విషయం...

సీఎస్పీ రోడ్డు నుంచి వీరఘట్టం ప్రధాన రోడ్డులో సర్వే నంబర్లు 162, 191, 214, 216లు మీదుగా సుమారు పది అడుగుల వెడల్పుతో గోర్జి (ప్రభుత్వ భూమి) ఉంది. ఈ గోర్జికి శివారులో ఉజ్జిడి చెట్టు ఉంది. వీరఘట్టం గ్రామదేవత పండగ చేసే టప్పుడు ఈ గోర్జి గుండా వెళ్లి అక్కడ ఉన్న ఉజ్జి డి చెట్టు వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. అయితే, ఈ గోర్జి పంట పొలాలకు మధ్యలో ఉండడంతో క్రమేపీ ఆక్రమణకు గురైంది. ఈ గోర్జిని కూడా కొందరు వ్యక్తుల నుంచి వ్యాపారులు వేర్వేరు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇక్కడ ఉన్న డి–పట్టా భూములను కూ డా చౌకగా కొనుగోలు చేశారు. లే అవుట్లు వేసి రూ.కోట్ల వ్యాపారానికి తెరతీశారు. గ్రామస్తులు ఆందోళన చేయడం, 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో ఇక్కడ ప్రభుత్వ పోరంబోకు భూ మి ఉన్నట్టు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ఆక్రమణలపై ఆరా తీస్తున్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు సైతం స్థానిక అధికారులకు పలు సూచనలిచ్చినట్టు సమాచారం. అయితే, ప్రభుత్వ అనుమతులు లేకుండా, ప్రభుత్వ భూమిని కబ్జా చేసి వేస్తున్న వెంచర్‌లో ఇళ్ల స్థలాల కొనుగోలుకు అడ్వాన్స్‌లు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు.



అక్రమ వెంచర్ భూ రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ మాధవి, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది

17 వైద్య కళాశాలల ఏర్పాటే ప్రభుత్వ లక్ష్యం

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐదు కళాశాలల్లో తరగతుల నిర్వహణ
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఒకే దఫాలో 17 ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని చెప్పారు. వాటిలో విజయనగరం సహా ఐదు వైద్య కళాశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. విజయనగరం జిల్లా పర్యటనకు సోమవారం వచ్చిన ఆమె గాజులరేగ వద్ద నిర్మాణంలోనున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలను పరిశీలించారు. తదుపరి విజయనగరంలోని సార్వజనీన ఆస్పత్రిని సందర్శించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అక్కడ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కళాశాల నిర్మాణం, తరగతుల నిర్వహణ ఏర్పాట్లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య వివరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. విజయనగరంలో రూ.500 కోట్ల వ్యయంతో తలపెట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. సార్వజనీన ఆస్పత్రివద్ద నిర్మించిన తాత్కాలిక భవనాల్లో 2023–24 విద్యా సంవత్సరం నుంచే వైద్య కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. తద్వారా 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెంటెంట్, ఇతర సిబ్బందిని ఇప్పటికే నియమించామని చెప్పారు. ఆమె వెంట వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ డి.మురళీధర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్, కలెక్టర్ ఎ.సూర్యకుమారి తదితరులు ఉన్నారు.

అమ్మ తరలివచ్చిన వేళ..

- పులకించిన భక్తజనం
- గామానికి చేరుకున్న శంబర పోలమాంబ
- శంబరలో జాతర కళ
- అమ్మవారికి ప్రత్యేక పూజలు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పోలమాంబ అమ్మవారు శంబర గ్రామానికి తరలివచ్చిన వేళ.. భక్తిభావం ఉప్పొంగింది. అమ్మవారి ఘటాలను చూసిన భక్తులు పులకించిపోయారు. ఘటాలకు ఎదురెళ్లి పసుపుకుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలు, తప్పెటగుళ్ల, మహిళల కోలాటాలతో అమ్మవారిని సోమవారం రాత్రి గ్రామంలోకి ఆహ్వానించారు. ఏటా జనవరి నెలలో జరగనున్న జాతరకు గ్రామస్తులు ఇప్పటికే సిద్ధం కాగా, అమ్మవారు గ్రామానికి చేరుకోవడంతో జాతరశోభ సంతరించుకుంది. గోముఖీనది ఆవలి ఒడ్డున ఉన్న అమ్మ వారి గద్దెవద్ద పూజారి, కుప్పిల, గిరడ, మున్సిబ్ కుటుంబాల వారు, గ్రామపెద్దలు అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఘటాలను గ్రామంలోకి తీసుకువచ్చారు. అమ్మవారికి మంగళవారం కాళ్లనొప్పులు కారణంగా గ్రామంలోని చదురుగుడిలో విశ్రాంతి తీసుకుని, బుధవారం నుంచి 14 రోజుల పాటు అమ్మవారు ఆలయంలో కొలువై పూజలందుకుంటారు. ప్రతి రోజు సాయంత్రం నుంచి రాత్రి వరకు అమ్మవారి ఘటాలను గ్రామంలోని అన్నివీధుల్లో తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం ఈనెల 23న తొలేళ్ల ఉత్సవం, 24న సిరిమానోత్సవం, 25న అనుపోత్సవం నిర్వహించి, ఈనెల 31న మారు జాత ర నిర్వహిస్తారు. ఇలా 10 వారాలపాటు అమ్మ వారి జాతర సాగుతుంది. సంక్రాంతి పండగకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అమ్మవారిని దర్శించుకుంటారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, ఈఓ వి.రాధా కృష్ణ, ట్రస్టుబోర్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యుడు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, రెవిన్నాయుడు, గ్రామపెద్దలు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలోకి అమ్మవారి ఘటాలను తీసుకువస్తున్న పూజారులు, గ్రామపెద్దలు

న్యూస్‌రీల్

12 మందికి కారుణ్య నియామక పత్రాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: శ్రీకాకుళం రోడ్డు రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన 12 మంది ఉద్యోగుల కుటుంబాల్లోని కొందరికి జిల్లాలోని సచివాలయాల్లో ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ మేరకు సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌ వారికి నియామక పత్రాలు అందజేశారు. విధులపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్‌ఎం ఎ.విజయ్‌ కుమార్‌, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, జిల్లా పరిషత్‌ సీఈఓ వెంకట్రామన్‌, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ విద్యాసాగర్‌, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ జయదేవి, తదితరులు పాల్గొన్నారు.

'వాసుదేవుని దర్శనంతో జన్మ చరితార్థం'

మందస: శ్రీవాసుదేవ పెరుమాళ్‌స్వామి దర్శనంతో జన్మ చరితార్థమవుతుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌ స్వామి ప్రధాన శిష్యులు త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌ స్వామి అన్నారు. మందస పట్టణంలో వాసుదేవుని సోమవారం ఉదయం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు, ఆండాళ్‌ గోష్ఠి, ఆలయ కమిటీతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏడుకొండల వెంకటేశుని అనంతరం ఇక్కడి విగ్రహం అంతటి అపురూపమైనదని తెలిపారు. చిన్నజీయర్‌ స్వామి గురువు రామానుజాచార్యులు ఇక్కడే విద్యాభ్యాసం చేయడంతో వాసుదేవుని ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఫిబ్రవరిలోనూ ఉత్సవాలు జరుగుతాయన్నారు. శంషాబాద్‌లో ఫిబ్రవరి రెండు నుంచి 11 వరకు సమతాకుంభ్‌ అనే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు.

'ఎక్కువ కేసులు రాజీ చేయాలి'



వీసీలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్‌ అహ్మద్‌ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: జాతీయ లోక్‌ అదాలత్‌ ఫిబ్రవరి 11న నిర్వహించనున్నామని, అందులో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్‌ అహ్మద్‌ మౌలానా సూచించారు. ఆయన సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. జిల్లాలోని న్యాయాధికారులందరితో మాట్లాడారు. రాజీపడదగ్గ కేసులకు లోక్‌ అదాలత్‌లో శాశ్వత పరిష్కారం చూపించాలని సూచించారు. వీసీలో శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్‌.సన్యాసినాయుడు, సీనియర్‌ సివిల్‌ జడ్జిలు నాగమణి, అనురాధ టెక్కలి సీనియర్‌ సివిల్‌ జడ్జి హరిత, రాజాం సీనియర్‌ సివిల్‌ జడ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకీతో ముగ్గురు అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీ

టెక్కలి: అక్రమంగా నాటు తుపాకీ కలిగి ఉన్న ముగ్గు రు వ్యక్తులను టెక్కలి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరిది మెళియాపుట్టి మండలం కాగా.. మరో వ్యక్తి జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కిల్లారి యుగంధర్‌ కావడం గమనార్హం. టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం .. టెక్కలి నుంచి మెళియాపుట్టి మధ్యలో గూడెం సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా అదే మార్గంలో మెళియాపుట్టి మండలం నందువ గ్రామానికి చెందిన సవర ప్రసాద్‌, సవర గజపతిలు బైక్‌పై వచ్చారు. వీరిపై అనుమానం వచ్చి పోలీసులు తనిఖీ చేయగా నాటు తుపాకీ కనిపించింది. దీంతో పోలీసులు షాకయ్యారు. పూర్తిస్థాయిలో తనిఖీ చేయగా నాటు తుపాకీతో పాటు తుపాకీని పోలిన మరో కర్ర అచ్చు, 12 ఎంఎం సామర్థ్యం కలిగిన 96 తూటాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా జలుమూరు పోలీస్‌ స్టేషన్‌లో హెడ్‌ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కిల్లారి యుగంధర్‌కు చెందిన నాటు తుపాకీ అని వారు చెప్పారు. దీంతో టెక్కలి పోలీసులు ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నాటుతుపాకీతో సంబంధం ఉన్న హెచ్‌సీది టెక్కలి మండలంలోని ఓ గ్రామమని సమాచారం. ఈ ఆయుధాన్ని ఎందుకు సిద్ధం చేసుకున్నారో తెలియాల్సి ఉంది.

ఆటో చోరీపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్‌: ఆటో చోరీకి గురైందని ఫిర్యాదు అందిందని శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్సై బలివాడ గణేష్‌ సోమవారం తెలిపారు. మండల వీధి సమీపంలో ఉన్న గైనేటి వీధిలో నివాసముంటున్న నల్లాన కృష్ణారావు తన ఆటోను ఆదివారం మధ్యాహ్నం మెయిన్‌రోడ్డును ఆనుకొని పార్కింగ్‌ చేశాడు. రాత్రి చూసేసరికి ఆటో కనిపించనట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



కన్నీటి ఉద్దానంపై పన్నీటి జల్లు

- కిడ్నీ వ్యాధి బాధితులకు అండగా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం
- శరవేగంగా కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌ నిర్మాణం
- త్వరలోనే పూర్తి కానున్న ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు

పచ్చటి ఉద్దానం కంట వెచ్చగా జారిన కన్నీటి బొట్లు ఏ నాయకుడి కంటా పడలేదు. ఏళ్లుగా ఇక్కడి బీల నేలలో తెగిపడిన తాళిబొట్లు ఏ నేతనూ కదిలించలేదు. ఐదో తనం కోల్పోయిన తల్లులు, అమ్మనాన్నలకు దూరమైన పిల్లలు, మనుషులు లేక వారి జ్ఞాపకాలుగా మిగిలిన ఇళ్లు.. ఏవీ ప్రజా ప్రతినిధుల కరకు గుండెలను కరిగించలేదు. హామీలిచ్చిన వారు కొందరు, అన్నీ చేసేశామని ప్రచారం చేసుకున్న వారు ఇంకొందరు. అలాంటి ఆపత్కాలంలో వచ్చాడొక నాయకుడు. వైద్యం కోసం విశాఖ వెళ్లే రోగుల చెంతకు దయాలసిస్‌ యూనిట్లు రప్పించాడు. డబ్బుల్లేక అల్లాడుతున్న అభాగ్యులకు చేతిలో నెలకు రూ.10 వేలు పెడుతున్నాడు. ఎక్కడో ఉన్న వంశధారను ఉద్దానంకు తీసుకువస్తున్నాడు. అతడే సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి. కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌, 200 పడకల ఆస్పత్రి, ఉద్దానం ప్రాజెక్టు ఆయన చిత్తశుద్ధికి సజీవ సాక్ష్యాలు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఉద్దానం ఊపిరి పీల్చుకుంటోంది. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండడంతో మృత్యుకౌగిట నుంచి విడుదలవుతోంది. వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం ఒకవైపు వ్యాధి మూలాలు కనుగొనేందుకు కిడ్నీ రీసెర్చ్‌ ఆస్పత్రిని నిర్మిస్తోంది. మరోవైపు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యంతో పాటు డయాలసిస్‌, ఉచిత మందులను పూర్తిస్థాయిలో అందిస్తోంది. ఇంకోవైపు వ్యాధి ప్రబలడానికి ప్రధాన కారణం తాగునీరై ఉండొచ్చన్న నిపుణుల సూచనల మేరకు రూ.700 కోట్లతో భారీ మంచినీటి పథకాన్ని నిర్మిస్తోంది. ఇవి త్వరలోనే పూర్తి కానున్నాయి.

పాదయాత్రలో చూసి..

పాదయాత్రలో కిడ్నీ వ్యాధి బాధితుల బాధలను వైఎస్‌ జగన్‌ దగ్గరుండి చూశారు. ప్రతిపక్ష నేత హోదాలో కవిటి మండలం జగతిలో కిడ్నీ బాధితుల భరోసా యాత్ర పేరిట పర్యటించారు. బాధితులతో ముఖాముఖి మాట్లాడి.. తన కార్యాచరణను అప్పుడే స్పష్టంగా ప్రకటించారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం డయాలసిస్‌ సెంటర్ల ఏర్పాటు, పింఛన్ల పెంపు, ఉపరితల తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు.

బాబుదంతా బడాయే..

అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, ఆయన భాగస్వామి పవన్‌ కల్యాణ్‌ ఉద్దానం కిడ్నీ బాధితులను పట్టించుకున్న పాపాన పోలేదు. తిత్లీ సమయంలో గోడు చెప్పుకుందామని వెళ్లిన వారిపై చంద్రబాబు మండిపడ్డారు కూడా. 2019 ఎన్నికల ప్రచారానికి సీఎం హోదాలో వచ్చిన చంద్రబాబు ఒక్క కిడ్నీ వ్యాధి బాధితుడికి కూడా భరోసా ఇవ్వలేకపోయారు. మరోవైపు పవన్‌ కల్యాణ్‌ పెద్ద ఎత్తున ఉద్దానం సమస్య పరిష్కరించేశానని ప్రచారం చేసుకున్నారు తప్ప.. చేసిన పని ఒక్కటీ లేదు. తన మిత్రపక్షం అధికారంలో ఉన్నా కూడా ఏమీ చేయలేకపోయారు.



కిడ్నీరీసెర్చ్‌సెంటర్‌ పరిశీలనలో మ్యాప్‌ చూస్తున్న మంత్రి డాక్టర్‌ సీదిరి అప్పలరాజు



వైఎస్‌ జగన్‌ సీఎం అయ్యాక..

- కిడ్నీ వ్యాధి గ్రస్తులకు పింఛన్‌ను రూ.3500 నుంచి రూ.10వేలకు పెంచారు. 5పైబడి సీరం క్రియేటినిన్‌ ఉన్న వారికి రూ.5వేలు, డయాలసిస్‌ రోగులకు రూ. 10వేల పింఛను ఇస్తున్నారు.
- ఉపరితల తాగునీరు అందించేందుకు రూ.700 కోట్ల వ్యయంతో భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాల్లో గల 827 గ్రామాలకు ఇంటింటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నారు.
- వ్యాధి మూలాలను తెలుసుకునేందుకు రీసెర్చ్‌ సెంటర్‌తో పాటు సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి కూడా మంజూరు చేశారు. మార్చిలో వీటిని ప్రారంభించనున్నారు.
- టెక్కలి, పలాస, సోంపేట, కవిటి, హరిపురం ఆస్పత్రుల్లో డయాలసిస్‌ సెంటర్లు ఉన్నాయి. 63 మెషీన్లతో 68పడకలపై డయాలసిస్‌ అందిస్తున్నారు. సోంపేట, కవిటిలో పడకలు పెంచారు. హరిపురంలో పది పడకలతో డయాలసిస్‌ సెంటర్‌ ఏర్పాటు చేశారు. కొత్తగా గోవిందపురం, అక్కుపల్లి, కంచిలి, బెలగాంలో డయాలసిస్‌ సెంటర్లు మంజూరయ్యాయి.
- ఇవి కాకుండా ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో 10పడకలు, బారువ సీహెచ్‌సీలో 10పడకలతో డయాలసిస్‌ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు కొత్తగా ప్రతిపాదనలు తయారయ్యాయి. ఇవికాకుండా రెండు కంటైన్డ్‌ బేస్డ్‌ సర్వీసెస్‌ డయాలసిస్‌ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే అవి జిల్లాకొచ్చాయి. కవిటి, సోంపేట సీహెచ్‌సీల్లో వీటిని అందుబాటులో ఉంచుతున్నారు. ఒక్కో యూనిట్‌లో ఏడేసి పడకలు ఉంటాయి.
- టీడీపీ హయాంలో డయాలసిస్‌ రోగులకు 20రకాల మందులే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు 37రకాల మందులను అందుబాటులో ఉంచారు.
- కిడ్నీ రోగులకు వైద్య పరీక్షల కోసం సెమీ ఆటో ఎనలైజర్స్‌, ఎలక్ట్రోలైట్‌ ఎనలైజర్స్‌, యూరిన్‌ ఎనలైజర్స్‌ను ఉద్దానం పరిధిలో ఉన్న 29 ల్యాబ్‌లలో అందుబాటులో ఉంచారు. పాతవి పాడైతే ఎప్పటికప్పుడు కొత్తవి కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతున్నారు.
- టీడీపీ హయాంలో జిల్లాలో నెఫ్రాలజీ విభాగమే లేదు. ఈ ప్రభుత్వం వచ్చాక శ్రీకాకుళం జీజీహెచ్‌లో నెఫ్రాలజీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరు అసిస్టెంట్‌ ప్రొఫెసర్లను నియమించారు. ప్రతి శనివారం పలాస సీహెచ్‌సీకి వెళ్లి అక్కడి రోగులకు వైద్యం అందిస్తున్నారు.

కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌ పరిశీలన

కాశీబుగ్గ: రాష్ట్ర ప్రభుత్వం కిడ్నీ రోగుల కోసం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కిడ్నీరీసెర్చ్‌ సెంటర్‌, 200 పడకల సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రిని రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్‌ సీదిరి అప్పలరాజు సోమవారం పరిశీలించారు. అధికారులతో కలిసి కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌ మూడు బ్లాక్‌లను తిరిగి పరిశీలించారు. వచ్చే మార్చిలో ప్రారంభించనున్నామని చెప్పారు. ఆయనతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్‌ బి.గిరిబాబు, పలాస తహసీల్దార్‌ లంబాల మధుసూదన్‌, మున్సిపల్‌ కమిషనర్‌ టి.రాజగోపాలరావు, ఆరోగ్యశాఖ అధికారులు ఉన్నారు.

బతుకుతా అనుకోలేదు



నా పేరు సుగ్గు లక్ష్మీ. ఇచ్ఛాపురం మండలం మారుమూల ప్రాంతం సన్యాసిపుట్టుగ గ్రామం మాది. నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ లక్షల రూపాయలు ప్రైవేటు ఆస్పత్రికే ధారబోశాను. అప్పట్లో కనీసం ఒక్క డాక్టర్‌ గానీ, మందులు ఇచ్చేవారు గానీ మా గ్రామానికి వచ్చేవారు కాదు. రెండున్నరేళ్ల నుంచి రూ.10వేలు పింఛన్‌ వస్తోంది. అంతే కాదు నన్ను డయాలసిస్‌ కేంద్రానికి తీసుకువెళ్లడానికి 108 బండి వస్తోంది. కలలో కూడా అనుకోలేదు నేను ఇప్పటి వరకు బతుకుతానని, అంతా జగనన్న దయే!

రూ. 10వేలు పింఛన్‌ అందుకుంటున్నాం



వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.10వేలు పింఛన్‌ ఇస్తున్నారు. టీడీపీ హయాంలో డయాలసిస్‌ చేసుకోవడానికి స్థానికంగా సరిపోయిన బెడ్స్‌ లేక ఇబ్బంది పడేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చాక ఆర్థిక సమస్యలు నుంచి గట్టెక్కాం. డయాలసిస్‌ కూడా సకాలంలో చేసుకుంటున్నాం.

– మద్రిపాటి తులసీదాస్‌, డయాలసిస్‌ రోగి, పెద్దశ్రీరాంపురం, కంచిలి మండలం

ఆదుకున్న జగనన్న ప్రభుత్వం



పూర్తిగా చితికిపోయిన కిడ్నీ బాధితుల్ని జగనన్న ప్రభుత్వం వచ్చాక ఆదుకుంది. ఉద్దానం పర్యటన సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిగా మా సమస్యల మీద దృష్టిపెట్టారు. మాకు అన్ని విధాలా సహకరిస్తున్నారు.

– లండ శంకరరావు, కిడ్నీ డయాలసిస్‌ రోగి, పెద్దశ్రీరాంపురం గ్రామం, కంచిలి మండలం

ఉచితంగా మందులు, ఇంజెక్షన్లు..



డయాలసిస్‌ కేంద్రంలో కిడ్నీ రోగులకు అవసరమైన అన్ని మందులను, ఇంజెక్షన్లను ఉచితంగానే ఇస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక విశాఖపట్నం లాంటి దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండానే డయాలసిస్‌ చేయించుకుంటున్నాం.

– అందాల రత్నాలు, డయాలసిస్‌ రోగి, లోహరిబంద గ్రామం, మందస మండలం

టైగర్‌ సవారీ



జిల్లా కేంద్రంలో పులి బొమ్మ వాహనదారులను కాసేపు కంగారు పెట్టింది. ఓ ఎగ్జిబిషన్‌లో పెట్టేందుకు పులి బొమ్మను ఆటో వెనుక కట్టి ఇలా తీసుకెళ్లారు. బొమ్మ కాస్త సజీవంగా కనిపించడంతో చూసిన వారికి కాసేపు కంగారు తప్పలేదు. – శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

విభజన హామీల సాధనకు 20 నుంచి సమరయాత్ర



మాట్లాడుతున్న శ్రీనివాస్‌

ఇచ్ఛాపురం: రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం చేసిన హామీల సాధన కోసం హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు సమరయాత్ర చేయనున్నట్లు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్‌ శ్రీనివాస్‌ చెప్పారు. స్థానిక రోటరీ ఫంక్షన్‌ హాల్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విభజనలో భాగంగా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన ప్రత్యే హోదా సాధించేలా విద్యార్థి సంఘాలు, ప్రజలను చైతన్యం చేయడానికి సమర యాత్ర చేస్తామన్నారు. ఈ యాత్ర జనవరి 20వ తేదీన హిందూపురంలో ప్రారంభించి ఫిబ్రవరి నాలుగో తేదీన ఇచ్ఛాపురంలో ముగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సునాయుడు, కార్యదర్శి సీహెచ్‌ వెంకటరమణ, ఎం.యుగంధర్‌, వేణుగోపాల్‌, నారాయణస్వామి పాల్గొన్నారు.

కళాకారుడు వెంకటేశ్వరరావుకు ఘన స్వాగతం



వెంకటేశ్వరరావుతో ఎంపీపీ దాస్‌ తదితరులు

సోంపేట: హైదరబాద్‌కు చెందిన ప్రముఖ మృదంగ కళాకారుడు యల్లా వెంకటేశ్వరరావు మంగళవారం సోంపేటలో జరగనున్న సంగీత విభావరి కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం బారువ చేరుకున్నారు. ఈయనకు ఎంపీపీ డాక్టర్‌ నిమ్మన దాస్‌, సర్పంచ్‌ యర్ర రజనీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సంగీత విభావరి కార్యక్రమంలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త పిరియా సాయిరాజ్‌ పాల్గొంటారన్నారు.

బంగారం పోయిందని ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్‌: బస్సులో ప్రయాణిస్తుండగా నాలుగు తులాల బంగారం, పది వేల రూపాయలతో ఉన్న పర్సు పోయిందని బాధితులు ఫిర్యాదు చేసినట్లు రెండో పట్టణ పోలీస్‌ స్టేషన్‌ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే .. ఎల్‌ఎన్‌పేట మండలం శ్యామలాపురం గ్రామానికి చెందిన పిల్లా సీతమ్మ గత నెల 13న విజయవాడ నుంచి శ్రీకాకుళం వరకు బస్సులో ప్రయాణించారు.. తీరా ఇంటికొచ్చాక తన బ్యాగు చూసేసరికి అందులో పర్సు మాయమైంది. భర్తకు తెలిస్తే కోప్పడతాడని భావించిన ఆమె విషయం చెప్పలేదు. అయితే ఈ విషయమై సీతమ్మను ఆమె భర్త ఆదివారం గట్టిగా నిలదీయంతో జరిగిన విషయం చెప్పింది. దీంతో భర్తను తీసుకొని వచ్చి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఎల్‌.ఎన్‌.పేట: కరకవలస గ్రామానికి చెందిన కుప్పిలి కరువులు (56) విష గుళికలు తిని సోమవారం ఆత్మాహత్యకు పాల్పడ్డాడు. కొండ పోడు పనులు చేస్తున్న సమయంలో భార్య భర్తల మధ్య మాటల వాదన జరిగింది. మనస్తాపానికి గురైన కరువులు చెద నివారణ కోసం ఉంచుకున్న విషగుళికలు తినేశాడు. భార్యపై కోపంతో అక్కడి నుంచి ఇంటికి నడుకుని వచ్చేశాడు. ఇంటికి వచ్చిన తరువాత అపస్మారక స్థితిలో చేరుకున్న కరువులును స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రికి వెళుతున్న సమయంలో ఈయన మృతి చెందాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సరుబుజ్జిలి పోలీసులు తెలిపారు.

వంశధార కాలువలో పడి వ్యక్తి మృతి

టెక్కలి రూరల్‌: వంశధార కాలువలో పడి వ్యక్తి మృతి చెందాడు. పొలవరం గ్రామ సమీపంలోని కాలువలో స్నానాలు చేస్తున్న వారు సోమవారం ఉదయం మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. టెక్కలి ఎస్సై-2 రమేష్‌బాబు సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించి.. విచారణ చేపట్టగా పాతపట్నం గాయత్రి నగర్‌కు చెందిన పండిట్‌ మార్కండేయ (59)గా గుర్తించారు. రెండేళ్లుగా క్యాన్సర్‌ వ్యాధితో బాధపడుతున్న ఈయన ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వచ్చేశాడు. అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది కాలువలో పడి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని అనుమానిస్తున్నట్టు ఎస్సై రమేష్‌బాబు చెప్పారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామన్నారు. మృతుడికి కుమారుడు శంకర్‌, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

భోగికి పిడకలు



మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులు ఆవు పేడతో తయారు చేసిన పిడకలను సోమవారం ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన 50వేల భోగి పిడకలను పెద్ద కుప్పగా పెట్టి గ్రామస్తులకు అవగాహన కల్పించారని పాఠశాల డైరెక్టర్‌ మోహనగాంధీ తెలిపారు. – సారవకోట

కేసులను సమన్వయంతో ఛేదించాలి



సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ జి.ఆర్‌.రాధిక

- జిల్లా ఎస్పీ జి.ఆర్‌.రాధిక

శ్రీకాకుళం క్రైమ్‌: నేర నియంత్రణకు నిఘా కట్టుదిట్టం చేయాలని జిల్లా ఎస్పీ జి.ఆర్‌.రాధిక అన్నారు. కేసులను సమన్వయంతో ఛేదించి శ్రీకాకుళాన్ని నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీస్‌ కార్యాలయంలో ఎస్పీ అధ్యక్షతన అదనపు ఎస్పీ (క్రైమ్‌) టి.పి.విఠలేశ్వరరావు ఆధ్వర్యంలో నేరాల ఛేదన, నిందితులను పట్టుకోవడం వంటి అంశాలపై సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సిబ్బంది అంకితభావంతో పనిచేసి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. కేసుల ఛేదనపై నైపుణ్యతను పెంచుకుని సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించాలన్నారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఎప్పటికప్పుడు పాత నేరస్తులపై నిఘా పెడుతూ వారి ఉనికిని కనిపెట్టాలన్నారు. సీసీ కెమెరాలు పనిచేసేవిధంగా చర్యలు చేపట్టి దేవాలయాల్లో చోరీలు, గొలుసు దొంగతనాలు, ఆస్తి నేరాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. రాత్రి గస్తీ నిర్వహించి అపరిచిత వ్యక్తులు తారసపడితే వారిని ప్రశ్నించడం, పాత నేర చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. జైలు నుంచి విడుదలైన ముద్దాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు పండుగ వేళల్లో దూరప్రాంతాలకు వెళ్లే వారికి స్థానిక పోలీసులు ఎల్‌.హెచ్‌.ఎం.ఎస్‌ యాప్‌ సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనుమానం కలిగిన ప్రతీ అపరిచిత వ్యక్తి తాలుకా ఫింగర్‌ ప్రింట్లను జిల్లా క్రైమ్‌ రికార్డ్‌ బ్యూరో వివరాలతో సరిపోల్చాలన్నారు. ఇతర జిల్లాల్లో జరిగే నేరాల్లో నేర తరహా విధానాన్ని తెలుసుకొని మన జిల్లాలో వారి ఉనికి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను సర్కిల్‌ పరిధిలో వారు పాటించి నేరాల సంఖ్యను తగ్గించాలని కోరారు. సంక్రాంతి నేపథ్యంలో కోడి పందాలు, పేకాట శిబిరాలు ఏర్పాటు చేయకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో సీఐలు జీవీ రమణ, బి.ప్రసాదరావు, పలువురు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.